క్లుప్తంగా

బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా రామ్మోహనశర్మ


రామ్మోహనశర్మ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గ బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా ఓరంపాడుకు చెందిన పిడతల రామ్మోహన్‌శర్మను ఆదివారం సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘ వార్షికోత్సవం పురస్కరించుకొని శంకర మఠంలో ఆది శంకరాచార్యులకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గంలోని కోడూరు, చిట్వేలి, ఓబులవారిపల్లి మండలాలో బ్రాహ్మణ కుటుంబాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్సీ సురేష్‌బాబు, చిందుకూరి నరసింహశర్మ, రాయ పెద్దిసతీష్, ప్రసాద్‌రావు, సురేష్‌బాబు, సుబ్రమణ్యంశర్మ, పవన్‌కుమార్, యోగి, నాగరాజ, కోసంగి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

రాజంపేట రూరల్ : ఇంజనీర్ ఎస్.రహిమాన్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు న్యాయవాది ఎస్.నసీరుద్దీన్ సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 150 మందికి స్థానిక పాత బస్టాండులో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు నరసింహరాజు, ఎం.సుబ్బరాయుడు, ఎస్.రామచంద్రరాజు, పి.నాగేశ్వర రావు, చంద్ర, ఎస్.అబ్దుల్లా, పి.రమేష్ నాయుడు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ సర్వసాధారణం


బాలకృష్ణరెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రామాపురం : మండలంలో సుద్దమళ్ల గ్రామం బయారెడ్డిగారిపల్లెకు చెందిన ఉపాధ్యాయుడు గడికోట బాలకృష్ణ రెడ్డి ఆదివారం పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలోని మైలురాళ్లలో ఒకటన్నారు. పదవీ విరమణ అనంతరం కుటుంబాలతో ఎక్కువ సమయం గడపడం, స్నేహితులతో సమయం వెచ్చించడం, తీర్థయాత్రలు వంటివి చేస్తూ జీవితాన్ని ఆస్వాదించాలన్నారు. అనంతరం ఆయనను పూలమాలలు వేసి సత్కరించారు. ఆయనతోపాటు మాజీ ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, చలమారెడ్డి, యోగాంజల్‌రెడ్డి, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో దగాపడుతున్న రైతులు


గిట్టుబాటు ధరలేని తమలపాకు

పుల్లంపేట : ఆరుగాలం కష్టపడి పంటలు పండించే రైతన్నకు తీరా పంటలు చేతికి అందే సమయానికి గిట్టుబాటు ధరలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పుల్లంపేట మండల పరిధిలోని అనంతంపల్లి, దళవాయిపల్లి, కేతరాజుపల్లి, రామక్కపల్లి, వత్తలూరు, పుత్తనవారిపల్లి, రాజుగోరుపల్లి గ్రామాలలో సుమారు వందలాది ఎకరాలలో రైతులు తమలపాకు పంటను సాగు చేస్తున్నారు. ఒక ఎకరా తమలపాకు పంటను సాగు చేయాలంటే సుమారు రూ. 1 లక్ష వరకు ఖర్చు వస్తుంది. పంట చేతికందే సమయానికి దళారులు చేతుల్లో రైతులు నలిగిపోతున్నారు. ఒక బుట్ట తమలపాకులు కోయడానికి కూలీ రూ. 100లు, ఖాళీ బుట్ట ధర రూ. 50లు కలిపి రూ. 150లు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం తమలపాకు బుట్టధర రూ. 100లు పలకడంతో తమలపాకు రైతులు గిట్టుబాటు ధర లేక విలవిలలాడిపోతున్నారు. గిట్టుబాటు ధరను కల్పించాలని మండల రైతులు కోరుకుంటున్నారు.

జూదరుల అరెస్టు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంటపంపల్లి గ్రామ పంచాయతీలోని పోలిబుచ్చయ్యగారిపల్లి గ్రామంలో ఆదివారం ఐదు మంది జూదరులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు పోలి బుచ్చయ్యగారిపల్లిలో స్థానిక ఎంపీపీ పాఠశాల సమీపాన జూదం ఆడుతున్నారన్న సమాచారంతో పోలీస్ సిబ్బంది దాడులు నిర్వహించగా ఈ దాడుల్లో ఐదు మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 1740 నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఐక్యతకు ప్రతీక పీర్ల పండుగ

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి


పీర్లకు బాసికాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి దంపతులు

రాజంపేట టౌన్ : పీర్ల పండుగ ఐక్యతకు ప్రతీక అని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. పట్టణంలోని పీర్లచావిడిలో ఏర్పాటు చేసిన పీర్లను ఆదివారం ఎమ్మెల్యే మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డితో కలిసి దర్శించుకొని చదివింపులు చేశారు. అనంతరం అమరనాథరెడ్డి మాట్లాడారు. మొహర్రం పండుగ ఆగమనాన్ని పురస్కరించుకొని గత వారం రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో కులమతాలకు అతీతంగా పీర్ల వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకుంటుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి వేడుకలు ప్రజల మధ్య ఆత్మీయాభిమానాలను మరింత పెంపొందిస్తాయని తెలిపారు. రాజంపేట పట్టణంలో నాగులమాను వీధిలో అనేక దశాబ్దాలుగా పీర్ల వేడుకలను, మొహర్రం పండుగను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఎంతో విశిష్టత సంతరించుకున్న ఇక్కడి పీర్ల వేడుకలో ప్రతి ఏడాది తాను పాల్గొంటుండటం తన పూర్వజన్మసుకృతమని తెలిపారు. పీర్ల ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, మున్సిపల్ ఛైర్మన్ ప్రారంభించి పేదలకు స్వయంగా అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పోలి మురళీరెడ్డి, దాసరి పెంచలయ్య, పీర్ల ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీర్లకు బాసికాలు అందజేత

మండల పరిధిలోని పెద్దూరు గ్రామంలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకలలో భాగంగా మొదటి రోజు ఆకేపాటి ఎస్టేట్‌కు పీర్లు రావడంతో పీర్లకు ఎమ్మెల్యే ఆకేపాటి ఆయన సతీమణి జ్యోతమ్మ ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం బాసికాలు అందజేశారు. అనంతరం తన సోదరుడు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి అన్నప్రసాదం అందజేశారు.

గంగమ్మ, మాతమ్మకు పూజలు

మండల పరిధిలోని ఆకేపాడు పంచాయతీలోని అచ్చనపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న గంగమ్మతల్లి జాతరలోను, పెద్దూరు గ్రామంలో నిర్వహిస్తున్న మాతమ్మతల్లి జాతరలోను, ఎమ్మెల్యే ఆకేపాటి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా పంచాయతీలోని అత్తిరాల దళితవాడలో నిర్వహిస్తున్న మాతమ్మతల్లి జాతరలో సర్పంచ్ రంగాల అలివేలు కోరిక మేరకు ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే ఆకేపాటి పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు రంగాల కమలాకర్‌రావు, రంగాల గురుమూర్తి, విష్ణు, వెంకటేషు, ప్రసాద్, ఆర్‌ఎంపీ గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాంతి సౌఖ్యాలకు ప్రతీక మొహర్రం

రాజంపేట రూరల్ : గ్రామాలలో శాంతి సౌఖ్యాలకు ప్రతీకగా మొహర్రం వేడుకలు నిలుస్తున్నాయని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆకేపాటి మురళీరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఆకేపాడులోని పెద్దూరు గ్రామంలో ఆదివారం ఘనంగా మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. ప్రతి సంవత్సరం లాగానే ఆకేపాటి మురళీరెడ్డి, సునీత దంపతులు మొహరం వేడుకలలో పాల్గొని ప్రత్యేక పార్థనలు చేశారు. అనంతరం పీర్లకు బాసికాలు అందజేశారు.

పీర్ల ఊరేగింపు

చిన్నమండెం : మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీ నుండి మొహర్రం ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మొహర్రం ఉత్సవాలలో భాగంగా ఆదివారం పీర్లమకాన్‌లోని గంధం పీరు దగ్గర ఉన్న ఇమామ్ పీర్లను సంతబజారులో ఘనంగా ఊరేగించారు. మంగళవాయిద్యాలు, బాణాసంచా పేలుళ్ల మధ్య ఇమామ్ పీర్లను ఊరేగించి తిరిగి అదే స్థానంలో కొలువుతీర్చారు. అదే విధంగా శనివారం రాత్రి ఇమామ్, ఖాసీం పీర్ల వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. గంధపు పీరును దర్శించుకోవడానికి పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు భక్తుల అగ్నిగుండ ప్రవేశం

వీరబల్లె : మండల కేంద్ర సమీపంలో ఉన్న ఈడిగపాలెంలో మొహర్రం వేడుకలలో భాగంగా నేడు సోమవారం రాత్రి అగ్నిగుండం ఏర్పాటు చేసి భక్తులు పీర్లను ఎత్తుకొని గుండంలో ప్రవేశించనున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల మండలాల నుంచే కాకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి నుంచి భక్తులు రానున్నారు. కాలక్షేపం కోసం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, చెక్కభజనలు వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పీర్ల పండుగ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఆదివారం పీర్లను పుర వీధులలో ఊరేగించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు పీర్ల స్వాములకు పూల బాసికాలు కట్టి, పానకాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు.


ఇమామ్ పీరును ఊరేగింపు చేస్తున్న దృశ్యం


రాజంపేట టౌన్: పేదలకు భోజనం వడ్డిస్తున్న ఆకేపాటి, పోలా


మొహర్రం వేడుకలలో పాల్గొన్న మురళీరెడ్డి, సునీత దంపతులు


ఈడిగపాలెంలో పురవీధులలో ఊరేగుతున్న పీర్లు

21న టెట్, డీఎస్సీపై అవగాహన సదస్సు

రాజంపేట టౌన్ : ప్రేమ్‌చంద్ హిందీ భవన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీ రాజంపేట పట్టణంలోని భారతీయ విద్యానికేతన్ పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు హిందీ టెట్, డీఎస్సీపై ఉచితంగా అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ఆ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.సర్తాజ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠ్యాంశ నిపుణులు టెట్, డీఎస్సీపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. అలాగే అభ్యర్థుల సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. అందువల్ల టెట్, డీఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 6303701314 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

శేష జీవితం ప్రశాంతంగా ఉండాలి

రాజంపేట రూరల్ : 40 సంవత్సరాల పాటు ఉపాధ్యాయునిగా విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించిన కవలకుంట్ల పాపయ్య, స్లీవమ్మల శేష జీవతం ప్రశాంతంగా గడిచిపోవాలని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆకాంక్షించారు. స్థానిక తోట కల్యాణ మండపంలో ఆదివారం పాపయ్య పదవీ విరమణ వేడుకలను వారి కుటుంబ సభ్యులు అత్యంత వేడుకగా నిర్వహించారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి మున్సిపల్ ఛైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డితో కలిసి పాపయ్య, స్లీవమ్మ దంపతులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాపాయ్య సేవలను కొనియాడారు. ఈ వేడుకలలో ఆకేపాటి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పి.విశ్వనాథ రెడ్డి, పోలీ మురళీమోహన్‌రెడ్డి, దండు గోపీ, దాసరి పెంచలయ్య, పి.శంకరశెట్టి, బి.పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు అభినందనీయం


శిబిరంలో రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యుడు

రాయచోటి అర్బన్ : స్వచ్ఛంద సేవా సంస్థలు, దాతలు పేదల కోసం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు రాహుల్ రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కొత్తపల్లె బడికరీమియా మసీదు ఆవరణలో ఎంఏ వెల్ఫేర్ సొసైటీ, లైఫ్‌కేర్ క్లినిక్‌ల ఆధ్వర్యంలో నిర్వహింపబడిన ఉచిత మెగా వైద్యశిబిరాన్ని వారు లాంఛనంగా ప్రారంభించారు. వారు మాట్లాడుతూ పేదమైనార్టీలు అధికంగా ఉండే కొత్తపల్లె ప్రాంతవాసుల సౌకర్యార్థం ఎంఏ వెల్ఫేర్ సొసైటీ స్పెషలిస్టు డాక్టర్‌లతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడమే కాక మందులను ఉచితంగా అందజేయడం గొప్ప విషయమన్నారు. ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా దాతలను మరింతగా ప్రోత్సహించి నట్లవుతుందన్నారు. అనంతరం కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.ఎం.ఆబిద్, షుగర్ వైద్యనిపుణుడు షేక్ రబ్బానీ, ఊపిరితిత్తుల వైద్యనిపుణుడు డాక్టర్ సురేష్‌కుమార్, చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ పెంచలయ్యలు శిబిరానికి హాజరైన సుమారు 500 మంది రోగులకు వైద్యసేవలందించారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ఎస్.నహవీల్‌బాషా, డాక్టర్ జక్రియా అహమ్మద్‌తోపాటు సొసైటీ సభ్యులు, రోగులు పాల్గొన్నారు.

జీపీఎస్ రాజపత్రాన్ని రద్దు చేయాలి


జీపీఎస్ రాజపత్రం ప్రతులను దగ్ధం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

రాజంపేట టౌన్ : జీపీఎస్ రాజపత్రాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి లక్ష్మీరాజ డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీపీఎస్ గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయడాన్ని నిరసిస్తూ యూటీఎఫ్ నాయకులు ఆదివారం రాజంపేట పట్టణంలోని డీఈఓ క్యాంపు కార్యాలయం ఎదుట జీపీఎస్ రాజపత్రాలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజ మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నది ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష అని, అయితే గత ప్రభుత్వం జీపీఎస్ అమలు చేసేందుకు సిద్ధం కాగా తాము చేసిన పోరాటాల ఫలితంగా అప్పటి ప్రభుత్వం జీఓను విడుదల చేయలేదన్నారు. అయితే కూటమి ప్రభుత్వం పాత తేదీలతో రాజపత్రాన్ని విడుదల చేయడం దుర్మార్గమన్నారు. 2023 అక్టోబర్ నుంచి సీపీఎస్ ఉద్యోగులందరిని జీపీఎస్‌లోకి తీసుకొస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసగించడమే అన్నారు. ప్రభుత్వం వెంటనే జీపీఎస్‌కు సంబంధించిన రాజపత్రాన్ని వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. లేకుంటే ఆందోళనా కార్యక్రమాలను ఉధృతం చేయనున్నట్లు హెచ్చరించారు. 2017వ సంవత్సరంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని వెంటనే అమలు చేసి 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు బి.హరిప్రసాద్, ఎస్.జాబిర్, ఎం.విజయ్‌కుమార్, డి.చెంగల్‌రాజు, పి.వెంకటసుబ్బయ్య, రమణయ్య, జి.నాగేంద్ర, శివకుమార్, రఫి, రమేష్, ఉదయ్‌భాస్కర్, విశ్వనాథ్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించాలి



మాట్లాడుతున్న ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలో రోజురోజుకు రెచ్చిపోతున్న కామాంధుల నుండి మహిళలు, చిన్నపిల్లలకు రక్షణ కల్పించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో ఒక బాలికపై ముగ్గురు కామాంధులు అత్యాచారం జరిపి శవాన్ని సైతం మాయం చేసిన సంఘటనను ప్రజలు మరువక ముందే విజయనగరం జిల్లా రామచంద్రాపురంలో ఆరునెలల పసికందుపై ఒక మానవ మృగం అత్యాచారయత్నానికి పాల్పడడం దారుణమన్నారు. పైసంఘటనను పరిశీలిస్తే రాష్ట్రంలో రోజురోజుకు మహిళలకు చిన్నారులకు రక్షణ లేకుండా పోతోందన్నారు. మహిళల రక్షణ కోసం చేసిన చట్టాలన్ని ఆయా కేసుల్లో నిందితుల చుట్టాలుగా మారుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అత్యాచార యత్నం కేసుల్లో నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మరోమారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఏపీ మహిళా సమాఖ్య నాయకురాళ్లు అరుణమ్మ, సుబ్బమ్మ, ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సంబేపల్లె పోలీసులకు కృతజ్ఞతలు'

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల గ్రామం నడిపిరాజుగారిపల్లె హరిజనవాడలో ఉంటున్న ఇసుకపల్లి చిన్న కృష్ణయ్య, కుమారమ్మ దంపతుల సంబంధికురాలు ఇసుకపల్లి అంజనమ్మ గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండగా ఈ క్రమంలో చికిత్స నిమిత్తం చెన్నైలోని రాజీవ్ గాంధీ గవర్నమెంట్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందగా చెన్నై వైద్యులు పోస్టుమార్టం నిమిత్తం మీ ప్రాంత పోలీసులు రావాలని లేకపోతే మేము బాడీని ఇవ్వమని చెప్పారు. ఈ విషయమై వెంటనే సంబేపల్లె ఎస్ఐ రామకృష్ణ అక్కడి పోలీసులతో మాట్లాడి బాడీని చెన్నై నుంచి ఇక్కడకు చేరేలా కృషిచేశారు. దీంతో మృతురాలి బంధువులు, సంఘ నాయకులు రామచంద్రలు ఎస్ఐకు, హెడ్ కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్య, సంబేపల్లె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

సౌత్‌జోన్‌కు నందలూరు వాసి


మారుతి శంకరాచారి

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన యువ క్రికెట్ క్రీడాకారుడు మారుతి శంకరాచారి సౌత్‌జోన్ క్రికెట్ టీమ్‌కు ఎంపికయ్యారు. ఈనెల 16వ తేదీ నుంచి 21వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే పోటీలలో మారుతి పాల్గొననున్నారు. ఎంపికలో విశేష ప్రతిభ కనబరిచి ఈ పోటీలకు ఎంపికయ్యారు. గతంలోనూ జిల్లా జట్టుకు ఎంపికై తమ ప్రతిభను చాటాడు. మారుతి సౌత్‌జోన్ టీమ్‌కు ఎంపిక కావడంతో పలువురు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

వర్షం కోసం బోనాలు


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న యువకులు

చిన్నమండెం : వర్షం బాగా కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలంటూ కురవపల్లె పెళ్లికాని యువకులు బోనాలు ఎత్తారు. మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామ పంచాయతీ కురవపల్లెలో సప్పలమ్మ తల్లికి, బైరేగి గుడికి యువకులు బోనాలు సమర్పించారు. ఆదివారం ఉదయం యువకులు తడిబట్టలతో ప్రసాదాలు వండి అక్కడి నుండి సాంప్రదాయ పద్ధతిలో మంగళవాయిద్యాల నడుమ సప్పలమ్మకు బోనాలు సమర్పించి అక్కడి నుండి కొండమూల వద్దనున్న బైరేగికొండలోని బైరేగి దేవుడికి యువకులు వెళ్లి మంగళస్నానాలు చేయించి బోనాలు సమర్పించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


చదువు చెప్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1990 – 91వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలోనే పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. జీవనోపాధి నిమిత్తం ఎక్కడెక్కడో స్థిరపడ్డ చిన్ననాటి స్నేహితులు దాదాపు 33 సంవత్సరాల తరువాత తాము చదువుకున్న పాఠశాలలోనే కలుసుకోవడంతో వారి ఆనందానికి ఆకాశమే హద్దయింది. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు పాఠశాలకు చేరుకునే సమయంలో స్థానికంగా ఉన్న మిత్రులు వారికి ఎదురెళ్లి ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని స్వాగతం పలికారు. చిన్నప్పుడు తాము చదువుకున్న తరగతి గదులను కలియ తిరిగి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం చదువు చెప్పిన గురువులను సన్మానించి వారికి పాదపూజ చేశారు. ఈ సందర్భంగా పలువురు గురువులతో తమకున్న అనుబంధాన్ని, తరగతి గదిలో జరిగిన తమాషా సంఘటనలను గుర్తు చేయడంతో పూర్వ ఉపాధ్యాయులు కడుపుబ్బా నవ్వుకున్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన రిటైర్డ్ హెడ్‌మాస్టర్ శంకరయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో సరదాగా గడిపిన చిన్ననాటి మిత్రులు ఇళ్లకు వెళ్లే సమయంలో బరువెక్కిన హృదయాలతో వెనుదిరిగారు.

పూడ్చుకోవడానికి స్థలం కేటాయించండి


తమ గ్రామానికి శ్మశాన స్థలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్న దళిత మహిళలు

రామాపురం : శ్మశాన స్థలం లేక చనిపోయిన వారిని వంకల్లో, వాగులలో, చెరువుల్లో కుంటల్లో పూడ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తరోడ్డు నారాయణపురానికి చెందిన దళిత మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పరిస్థితి రెవెన్యూ అధికారులు పరిగణలోనికి తీసుకుని తమకు శ్మశానానికి స్థలం కేటాయించాలని వారు కోరుతున్నారు. ఆదివారం గ్రామ మహిళలు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామం పుట్టి 40 ఏళ్లు కావస్తున్న ఇంతవరకు గ్రామానికి శ్మశాన స్థలం లేక చనిపోతే స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని వారు వాపోయారు. గ్రామం ఆనుకొని రోడ్డు పక్కన శ్మశాన స్థలంలో అరకొరగా పూడ్చుకుంటున్నామని, శ్మశానానికి ఆనుకొని బంజర భూమి మూడు ఎకరాలు వరకు ఉందని, ఆ భూమిని అదే గ్రామానికి చెందిన పలువురు ఆక్రమించారని వాపోయారు. ఆక్రమణ నుంచి భూమిని అధికారులు స్వాధీనం చేసుకొని శ్మశానవాటిక స్థలానికి అప్పగించాలన్నారు. కార్యక్రమంలో మహిళలు నాగరత్న, అమరావతి, గంగజోమ్మ, నాగరతమ్మ, నాగమ్మ, రామలక్ష్మమ్మ, రవణమ్మ, భాగ్యమ్మ, అంజనమ్మ, గంగాదేవి, అనసూయమ్మ, మునియమ్మ, రామానుజులు, చిన్నప్ప, లక్ష్మమ్మ, భూషణమ్మలు పాల్గొన్నారు.

గుంజన కట్టుకొమ్మ పరిశీలన


ఎస్ఆర్ పురం వద్ద ఉన్న గుంజన నది కట్టుకొమ్మను పరిశీలిస్తున్న చెంగల్రాయుడు

పెనగలూరు : మండలంలోని ఎస్ఆర్ పురం వద్ద ఉన్న గుంజన నది కట్టుకొమ్మను మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయుడు ఆదివారం పరిశీలించారు. గతంలో వచ్చిన వరదలకు కట్టుకొమ్మ కొట్టుకుపోవడంతో గుంజన నదిలో నీరు లేకుండా సోమశిల ప్రాజెక్టులోకి వెళ్లిపోయింది. దీంతో నది ప్రాంతంలో ఉన్న రైతులు విషయాన్ని మాజీ ఎమ్మెల్సీకి తెలియజేయడంతో ఆయన కట్టుకొమ్మను పరిశీలించి వీలైనంత త్వరలో కట్టుకొమ్మను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నారాయణ రెడ్డి, జిలకర నాగేంద్ర, వెంకటసుబ్బయ్య, కత్తి సుబ్బరాయుడులతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నృత్య కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి


డ్యాన్స్ మాస్టర్ నాగ

రాజంపేట టౌన్ : ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్స్ మాస్టర్స్ అండ్ డ్యాన్సర్స్ అసోసియేషన్ సహాయ కార్యదర్శిగా రాజంపేట పట్టణానికి చెందిన డ్యాన్స్ మాస్టర్ పెద్దపల్లి నాగార్జున అలియాస్ నాగ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈనెల 12వ తేదీ తాడేపల్లెలోని రాష్ట్ర అసోసియేషన్ కార్యాలయంలో నూతన కమిటీ ఎంపికపై ఎన్నికలు జరిగాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో తాను సహాయ కార్యదర్శి పదవికి పోటీ చేయగా తాను ఒక ఓటుతో గెలుపొందానన్నారు. నృత్య కళాకారులు తనపై నమ్మకంతో గెలిపించారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రంలోని నృత్య కళాకారుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు జరిగాయని చెప్పారు.

ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు


లక్కిరెడ్డిపల్లె: దర్శనమిస్తున్న అనంతపురం గంగమ్మ


సంబేపల్లె: ప్రత్యేక అలంకారంలో నల్లగంగమ్మ


సిద్దవటం: పూజలందుకున్న ఇరుగులమ్మ మాత మూల విరాట్


పెనగలూరు: పూజలందుకున్న గంగమ్మతల్లి

సంబేపల్లె : మండల పరిధిలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిపోయింది. వేకువజాము నుంచే అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులు అమ్మవారికి అభిషేకాలు, పూజలు చేశారు. ముస్లిం భక్తులు సైతం అమ్మవారిని దర్శించుకొని పూజలు చేయడం విశేషం. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అనంతపురం గంగమ్మకు బోనాలు

లక్కిరెడ్డిపల్లె : శ్రీశ్రీ అనంతపురం గంగమ్మకు ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి బోనాలు, తలనీలాలు సమర్పించారు. ఆదివారం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో నిండింది. లక్కిరెడ్డిపల్లె పోలీసులు భక్తులకు క్యూ లైన్ల ద్వారా అమ్మవారి దర్శనాన్ని కల్పించారు. ఆలయ పూజారులైన చెల్లి వంశీయులు గంగయ్య, సాయి, గంగాధర్, రవిలు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారి విశిష్టతను వివరించడం జరిగింది.

వైభవంగా ఇరుగులమ్మకు పూజలు

సిద్దవటం : మండలంలోని సిద్దవటం గ్రామ శివారులో మూలపల్లె క్రాస్ రోడ్డు వద్ద పెన్నానది ఒడ్డున వెలసిన ఇరుగులమ్మకు ఆదివారం వైభవంగా పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్రనామార్చన, కుంకుమార్చన, అర్చనలు వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వచ్చిన భక్తులకు మండలంలోని మూలపల్లె గ్రామానికి చెందిన కొల్లా రవి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

వైభవంగా గంగమ్మ జాతర

పెనగలూరు : మండలంలోని సింగారెడ్డిపల్లి పంచాయతీ కంబాలకుంట బీసీ కాలనీ వద్ద కొలువైన గంగమ్మ జాతరను ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత మూడు రోజుల నుంచి జాతరను స్థానికులు భక్తులు జరుపుకుంటున్నారు. ఉదయం అమ్మవారికి పొంగళ్లు, చల్లపోసుకొని భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే కొంతమంది అక్కడికి వచ్చిన భక్తులకు రాగిసరి ఏర్పాటు చేశారు. ఆలయం ముందు వివిధ రంగులతో వేసిన గంగమ్మ ప్రతిమ ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ప్రతి కుటుంబం నుండి చద్ది అన్నం తెచ్చి కొన్ని కుండలో పోసి తిరిగి గంగమ్మతల్లి ఎదురుగా ప్రజలకు చల్లపోసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వర్షాలు కురవాలని గంగమ్మతల్లికి చల్లపోసుకున్నట్లు వారు తెలిపారు.